PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 53 ‖ సోమవారం ‖ 20-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

20 జూలై 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి సప్తమి తె. 4:04o వరకు తరువాత అష్టమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం హస్త రా. 7:09 వరకు తరువాత చిత్తా యోగం శివ సా. 6:34 వరకు కరణం గరజి మ. 3:46 వరకు వనిజ తె. 4:04o వరకు వర్జ్యం తె. 3:42 నుండి తె. 5:25 వరకు దుర్ముహూర్తం మ. 12:48 నుండి మ. 1:39 వరకు మ. 3:23 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:32 నుండి ఉ. 9:08 వరకు యమగండం ఉ. 10:45 నుండి మ. 12:22 వరకు గుళికాకాలం మ. 1:59 నుండి మ. 3:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు మ. 12:54 నుండి మ. 2:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున

## సింధూ నయా హిస్టరీ



భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ కైవసం చేసుకుని అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్‌కు చెందిన ప్రపంచ స్టార్ ప్లేయర్ అకానే యమగుచిపై సింధు వరుస గేముల్లో ఘన విజయం సాధించింది.



## విశ్వ విజేతగా స్పెయిన్

ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తూ సాగిన 2026 ఫిఫా వరల్డ్ కప్‌కు ఆదివారం ఘన ముగింపు పలికింది. అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఫైనల్ పోరులో స్పెయిన్ అద్భుత పోరాట పటిమతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను 1-0తో మట్టికరిపించి ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడింది. తొలి విజిల్ నుంచి చివరి క్షణం వరకు ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా, స్పెయిన్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజేతగా నిలిచింది. 2010లో తొలిసారి ప్రపంచకప్‌ను గెలిచిన స్పెయిన్, 16 ఏళ్ల విరామం తర్వాత మరోసారి ప్రపంచ విజేతగా అవతరించి తన ఫుట్‌బాల్ వారసత్వాన్ని మరింత బలోపేతం చేసింది. మరోవైపు వరుసగా రెండోసారి కప్‌ను కైవసం చేసుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆవిరయ్యాయి.

# పార్లమెంట్ సమరం..
# నేటి నుంచే

## బిల్లుల వేడి, విపక్షాల వ్యూహాలతో రసవత్తరంగా సమావేశాలు!


దేశవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠ రేపుతున్న పార్లమెంట్ ప్రతిష్ఠాత్మక సమావేశాలు నేటి నుంచే ప్రారంభం కానున్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన అత్యంత కీలకమైన బిల్లును అధికారిక ఎజెండాలో ఇంకా చేర్చకపోయినప్పటికీ, ఈ ప్రతిష్ఠాత్మక బిల్లుపై అవసరమైన సంఖ్యాబలాన్ని కూడగట్టేందుకు అధికార కూటమి అన్ని రకాలుగా పావులు కదుపుతోంది. మరోవైపు ఈ బిల్లును గట్టిగా తిప్పికొట్టాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సన్నద్ధమవుతోంది.

### మహిళా రిజర్వేషన్లపై అధికార కూటమి నజర్

### పేపర్ లీకేజీలు, అయోధ్య విరాళాల చోరీపై నిలదీసేందుకు విపక్షాల సిద్ధం


### అఖిలపక్ష భేటీ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ, జులై 19: ఈ విడత సమావేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లు, 'వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు వంటి అనేక కీలక బిల్లులు ఉభయ సభల ముందుకు చర్చకు రానున్నాయి. సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలోనే పార్లమెంట్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. 'ఇండియా' కూటమితో ఇప్పటికే తెగదెంపులు చేసుకున్న డీఎంకే, తమ పార్టీ సభ్యులకు సభలో విడిగా సీట్లు కేటాయించాలని కోరింది. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయి, కొత్తగా ఏర్పాటైన 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో చేరినట్లు ప్రకటించిన 20 మంది ఎంపీల విడిగా కూర్చునే అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఆమోదించారు.



అయితే, సాంకేతికంగా వారిని ఆ కొత్త పార్టీ భాగంగానే గుర్తించాలన్న వినతిపై స్పీకర్ నుంచి తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ఇక వివిధ ప్రజాసమస్యలు, వివాదాస్పద అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. దేశాన్ని కుదిపేసిన ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ప్రతిపక్షం తరువాయి 2 వ పేజీలో..




## నేడే పార్లమెంట్ మార్చ్

### విజయవంతం చేయాలని వాంగ్‌చుక్ పిలుపు

### భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు

### వాంగ్‌చుక్ తరలింపును సమర్థించిన హైకోర్టు

న్యూఢిల్లీ, జులై 19: ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా 21 రోజులుగా పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసిన నేపథ్యంలో, ఆయన పిలుపు మేరకు 'పార్లమెంట్ మార్చ్' నిరసన ర్యాలీ సోమవారం జరగనుంది. తనను ఆస్పత్రిలో అక్రమంగా నిర్బంధించారని ఆక్షేపించిన వాంగ్‌చుక్.. నిర్భయమైన భారత్ సాకారం కోసం, అన్యాయం నుంచి విముక్తి తరువాయి 2 వ పేజీలో..



2

## 21న హకీంపేటలో రేవంత్ పర్యటన

### పారిశ్రామిక జోన్ పనులపై ప్రత్యేక సమీక్ష

### క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 21న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో పర్యటించనున్నారు. దుద్యాల మండలం హకీంపేటలో సీఎం పర్యటన ఖరారు కావడంతో స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు సంబంధించి ఆదివారం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సురేందర్, దుద్యాల తహసీల్దార్ తో పాటు కొడంగల్ సీఐ, ఎస్ఐ తదితర అధికారులు ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.




## ప్రధాని నరేంద్ర మోడీ గారిచే ఆగస్టు 1న ఎయిర్పోర్ట్ ప్రారంభం

### ఆంధ్రప్రదేశ్‌కు భాగ్యనగరం కానున్న మన భోగాపురం

### అల్లూరి పేరుతో ఎయిర్పోర్ట్ జాతికి అంకితం.. జగన్ పార్టీ క్రెడిట్ చోరీకి సిద్ధం

3

పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్కెట్ చైర్మన్ బంగారు రాజు, కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్ గార్లు, ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులు



2

## ఇది రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

### కాళేశ్వరం నీళ్ల కోసం కదంతొక్కిన రైతులు

### రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

కాళేశ్వరం నీళ్ల కోసం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా కదంతొక్కారు. రంగనాయక సాగర్ నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు పదిహేను కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ఈ యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకల్లా ముగిసింది.

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పట్టుదలతో పనిచేసి అనుకున్నది సాధిస్తారు. కొన్ని పరిస్థితులు మనోవిచారాన్ని కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. హనుమాన్ చాలీసా పఠిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి.

**వృషభం :** కీలక విషయాల్లో దిగ్విజయంగా ముందుకెళ్తారు. వృత్తి, వ్యాపార రంగాల్లో మీకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు మారతాయి. ఆనందించే సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఇష్టదైవ స్తుతి మంచిది.

**మిథునం :** ఉద్యోగంలో కార్యసిద్ధి ఉంది. స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల మాటలకు గౌరవం ఇస్తూ ముందుకెళ్లండి. శుభం జరుగుతుంది. ఆంజనేయ స్వామి సందర్శనం శుభప్రదం.

**కర్కాటకం :** చేపట్టే పనులకు ఆటంకం కలగకుండా చూసుకోవాలి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. కొన్ని సంఘటనల్లో ఆటంకాలు ఎదురైనా అధైర్యపడకుండా ముందుకు సాగితే మేలైన ఫలితాలు లభిస్తాయి. దుర్గాస్తుతి శుభదాయకం.

**సింహం :** చేపట్టిన పనులలో పురోగతి ఉంటుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. సంతృప్తికర ఫలితాలను రాబట్టడానికి ఇది సరైన సమయం. సౌభాగ్య సిద్ధి ఉంది. ఇష్టదేవత స్తోత్ర పఠనం శుభప్రదం.

**కన్య :** మీ మీ రంగాల్లో కార్యజయం ఉంది. కీర్తి వృద్ధి చెందుతుంది. బంధువుల ఆదరాభిమానాలుంటాయి. అర్థలాభం ఉంది. ఆంజనేయ స్వామి ఆరాధన శుభదాయకం.

**తుల :** తలపెట్టిన కార్యాల్లో విజయసిద్ధి ఉంది. ఒక శుభవార్త ఉత్సాహాన్నిస్తుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. తోటివారి సహాయ సహకారాలున్నాయి. దైవబలం రక్షిస్తోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి సందర్శనం శుభప్రదం.

**వృశ్చికం :** మీ మీ రంగాల్లో సందర్భానుసారంగా ముందుకు సాగితే శుభఫలితాలు అందుకుంటారు. మీ పట్టుదలే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. అనవసర విషయాల్లో తలదూర్చకండి. లక్ష్మీ ధ్యానం మంచినిస్తుంది.

**ధనుస్సు :** శ్రమకు తగిన ఫలితాలుంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారులతో నమ్రతగా వ్యవహరించాలి. గిట్టనివారు మీ ఉత్సాహంపై నీళ్లు చల్లుతారు. మనోవిచారం కలిగించే ఘటనలకు దూరంగా ఉండాలి. సూర్య స్తుతి మేలుచేస్తుంది.

**మకరం :** ప్రశాంతమైన ఆలోచనలతో గొప్పవారవుతారు. సమర్థతను పెంచాలి. కీలక విషయాల్లో బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి. శుభఫలితాలు పొందడానికి వేంకటేశ్వర స్వామిని సందర్శించాలి.

**కుంభం :** లక్ష్యాలకు కట్టుబడి పనిచేయాలి. ధర్మ సందేహాలతో కాలా న్ని వృథా చేయకండి. కుటుంబ సభ్యులతో ఆచితూచి వ్యవహ రించాలి. మనోవిచారం కలగకుండా చూసుకోవాలి. ప్రయా ణంలో ఆటంకాలు కలుగుతాయి. శివారాధన శుభప్రదం.

**మీనం :** చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. కొన్ని సందర్భాల్లో లౌక్యంగా వ్యవహరించి సమస్యలను అధిగమిస్తారు. భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగండి. గణపతి ఆరాధన శుభప్రదం.



# పార్లమెంట్ సమరం నేటి నుంచే

**మొదటి పేజీ తరువాయి**

గట్టిగా పట్టుబట్టనుంది. అలాగే, అయోధ్యలో విరాళాల చోరీ అంశంపై పార్లమెంటును స్తంభింపజేస్తామని సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ప్రకటించడంతో సభలో తీవ్ర దుమారం రేగడం ఖాయంగా కనిపిస్తోంది. వీటితో పాటు పెట్రోలులో ఇథనాల్ కలపడం, దేశ విదేశాంగ విధానం వంటి కీలక అంశాలు కూడా ఈ విడత సమావేశాలను ఉడికించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన సాంప్రదాయ అఖిలపక్ష సమావేశం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్‌ఆద్మీ, మరియు వామపక్ష పార్టీలకు చెందిన ప్రతిపక్ష నేతలు సభ నుండి వాకౌట్ చేశారు.

తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన 20 మంది తిరుగుబాటు ఎంపీలను ఈ సమావేశానికి ఆహ్వానించడంపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ విలీనానికి స్పీకర్ ఇంకా అధికారిక ఆమోదం తెలపలేదని, టేబుల్ ఆఫీస్ రికార్డుల ప్రకారం తమ బలం 28 మందిగానే ఉందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా స్పష్టం చేయగా, రాజ్యాంగ రక్షణ కోసమే తాము వాకౌట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ పేర్కొన్నారు. మరోవైపు, పార్లమెంట్ సమావేశాలను సజావుగా నడిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్‌లతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులుగా లావు శ్రీకృష్ణదేవరాయలు (టీడీపీ), బాలశౌరి (జనసేన), మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి (వైసీపీ), వద్దిరాజు రవిచంద్ర (బీఆర్ఎస్) తదితరులు పాల్గొన్నారు.

# ఇది రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

**కాళేశ్వరం నీళ్ల కోసం కదంతొక్కిన రైతులు**

**సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు రైతుల పాదయాత్ర**

**పగ, ప్రతీకారంతోనే దిగువకు వృథాగా 70 టీఎంసీలు**

**సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్**

సిద్దిపేట, జూలై 19: కాళేశ్వరం నీళ్ల కోసం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల రైతులు స్వచ్ఛందంగా కదంతొక్కారు. రంగనాయక సాగర్ నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు పదిహేను కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ఈ యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకల్లా ముగిసింది. ఇది బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన యాత్ర కాదని, కేవలం చిన్నకోడూరు రైతులు కరువు నుంచి కాపాడుకునేందుకు స్వచ్ఛందంగా చేపట్టిన కార్యక్రమమని, వారి ఆహ్వానం మేరకే తాను హాజరయ్యానని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పుడున్న కరువు ప్రకృతి తెచ్చింది కాదని, అది కాంగ్రెస్ మరియు రేవంత్ రెడ్డి తెచ్చిన కరువేనని ఆయన విమర్శించారు. కేసీఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న పగ, ప్రతీకారంతోనే రేవంత్ రెడ్డి కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ ను తిడితే ముఖ్యమంత్రి ఆనందపడొచ్చు కానీ, నీళ్లు లేక రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ను తిట్టడం మానేసి వెంటనే మోటార్లు వేసి నీళ్లు ఇవ్వాలని హితవు పలికారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్లను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలేస్తుంటే, పక్క రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పట్టిసీమ మోటార్లు ఆన్ చేసి వాడుకుంటున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. 70 టీఎంసీల నీళ్లను వృథాగా ఆంధ్రాకు వదిలేశారని, అదే నీటిని ఎత్తిపోస్తే ఈపాటికి రంగనాయక సాగర్ నిండుగా ఉండేదని వివరించారు. నీళ్లు లేక రంగనాయక సాగర్ లో రాళ్లు, చెట్లు కనిపిస్తూ చిన్నబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ లను నింపాలని, లేదంటే అన్ని మండలాల రైతులు తిరగబడి కాంగ్రెస్ ప్రభుత్వం వారి కోపంలో మాడి మసైపోవడం ఖాయమని హెచ్చరించారు.

# 21న హాకీంపేటలో సీఎం రేవంత్ పర్యటన

**పారిశ్రామిక జోన్ పనులపై ప్రత్యేక సమీక్ష**

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు**



కొడంగల్, జూలై 19: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 21న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో పర్యటించనున్నారు. దుద్యాల మండలం హాకీంపేటలో సీఎం పర్యటన ఖరారు కావడంతో స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ పర్యటనకు సంబంధించి ఆదివారం ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ సురేందర్, దుద్యాల తహసీల్దార్ తో పాటు కొడంగల్ సీఐ, ఎస్ఐ తదితర అధికారులు ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, హెలిప్యాడ్ ఏర్పాటు, సమీక్షా సమావేశం నిర్వహించే ప్రాంగణాలను వారు నిశితంగా పరిశీలించి సిబ్బందికి తగిన దిశానిర్దేశం చేశారు.

**అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా**

హాకీంపేట పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న పలు కీలక అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో అక్కడే ఆయన ఒక సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. హాకీంపేట, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో ప్రతిపాదించిన పారిశ్రామిక జోన్ పనులు, దానికి సంబంధించిన భూసేకరణ పురోగతిపై ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు. స్థానికంగా మౌలిక వసతుల కల్పన, నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన రహదారులు, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు.

దుద్యాల మండలంలో ప్రజా సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు ఏ విధంగా అందుతున్నాయనే విషయమై ముఖ్యమంత్రి ఆరా తీయనున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలీసు శాఖ పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు తమ నేత రాకను పురస్కరించుకుని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనను అత్యంత విజయవంతం చేసేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.



# రైతులకే తొలి ప్రాధాన్యత

**నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం**

**ఇల్లెందు పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ఇల్లెందు, జూలై 19: రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఇల్లెందు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కామేపల్లి మండలం మద్దులపల్లి, ఇల్లెందు మండలం రొంపేడు, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, ప్రస్తుతం డిమాండ్ 16 వేల మెగావాట్లకు చేరిందని ఆయన వివరించారు. డిమాండ్ పెరిగినా వ్యవసాయ, గృహ, పారిశ్రామిక రంగాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేందుకు డివిజన్ల వారీగా 160 ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, ఏవైనా సమస్యలు ఉంటే 1912 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంత గిరిజన పోడు సాగుదారుల కోసం ప్రత్యేకంగా ఇందిరా సౌర గిరి జల వికాసం అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. గిరిజన ఉప ప్రణాళిక నిధులతో అమలు చేసే ఈ పథకం కింద బోర్ బావులు, పంపుసెట్లు, వ్యవసాయ పరికరాలను అందజేస్తామని ఆయన తెలిపారు. దీనివల్ల గిరిజన రైతుల ఆత్మగౌరవంతో పాటు వారి ఆదాయం కూడా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింధూ నయా హిస్టరీ

**ఫైనల్లో జపాన్ స్టార్ ప్లేయర్ ..**

**యమగుచిపై వరుస గేముల్లో విజయం**

టోక్యో, జులై 19: భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ కైవసం చేసుకుని అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్‌కు చెందిన ప్రపంచ స్టార్ ప్లేయర్ అకానే యమగుచిపై సింధు వరుస గేముల్లో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించిన సింధు.. 21-17, 21-17 తేడాతో యమగుచిని మట్టికరిపించింది. ప్రతి గేము చివరి వరకు ఇరు ఆటగాళ్ల మధ్య హోరాహోరీగా సాగినప్పటికీ, ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కేవలం 50 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ కీలక ఫైనల్ మ్యాచ్‌కు ముందు యమగుచిపై సింధుకు ఈ ఏడాది పెద్దగా సానుకూల రికార్డేమీ లేదు. 2026లో ఈ ఫైనల్‌కు ముందు ఇరు దేశాల ఆటగాళ్లు మూడుసార్లు ముఖాముఖి తలపడగా, అందులో రెండుసార్లు యమగుచినే విజయం సాధించింది. థాయ్‌లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌తో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఈ జపాన్ క్రీడాకారిణిదే పైచేయి కాగా, కేవలం మలేషియా ఓపెన్‌లో మాత్రమే యమగుచి మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లడంతో సింధుకు విజయం దక్కింది. ఈ ప్రతికూల గణాంకాల వల్ల ఫైనల్లో సింధుపై కాస్త ఒత్తిడి ఉన్నప్పటికీ, మైదానంలో ఆమె ఎక్కడా ఆ ఒత్తిడిని కనబరచలేదు.

# నేడే పార్లమెంట్ మార్చ్

**మొదటి పేజీ తరువాయి**

కోసం కాక్రోచ్ జనతా పార్టీ నేడు చేపట్టదలచిన ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని తన మద్దతుదారులను కోరారు. తెల్లకాగితంపై ఆయన స్వయంగా రాసిన ఈ సందేశాన్ని భార్య గీతాంజలి ఆయన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్నందున భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఈ పార్లమెంట్ మార్చ్‌కు అనుమతి నిరాకరించినట్లు సమాచారం.ఇదిలా ఉంటే, దీర్ఘకాలం పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చిన్నపాటి సమస్యలు తలెత్తినప్పటికీ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని, నిపుణులైన వైద్యుల బృందం ఆయన్ను నిశితంగా పరిశీలిస్తోందని ఆస్పత్రి యాజమాన్యం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆయన్ను దీక్షా స్థలి నుంచి తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

శ్వేత

# సంపాదకీయం

**సోమవారం 20-7-2026**

## మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా!

ట్రంప్ ప్రపంచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లఫ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది.

అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు.

అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

# అధ్యక్షుడి చేతులు కట్టేస్తే ఎలా?

**బండి, ఈటల కలిస్తే అధికారం వస్తుందా?**

**జీహెచ్ఎంసీలో ఒక మేయర్ అయినా గెలుస్తారా**

**వ్యక్తి కేంద్రంగా నిర్ణయాలు కాకుండా సమష్టిగా జరగాలి**

**ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్, జూలై 19: తెలంగాణ బీజేపీలో ఇద్దరు అగ్రనేతలు కలిస్తే పార్టీ అధికారంలోకి వచ్చేస్తుందా అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీ అధిష్ఠానాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇటీవల రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి సమక్షంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సమన్వయం కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఇద్దరు నేతలు కలిసి పనిచేయడం మంచి పరిణామమే అయినా, అంతమాత్రాన రాష్ట్రంలో అధికారం దక్కుతుందనుకోవడం సరికాదన్నారు. పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడుతున్న సీనియర్ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తల పరిస్థితి ఏమిటో నాయకత్వం ఆలోచించాలని ఆయన హితవు పలికారు. కనీసం సగం స్థానాలు గెలవండి

త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎన్నికలపైనా రాజాసింగ్ తనదైన శైలిలో స్పందించారు. రాబోయే ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో మేయర్ పదవులు గెలుస్తామని నేతలు గొప్పలు చెబుతున్నారని, ముందుగా కనీసం ఒక్క కార్పొరేషన్లో అయినా సగం కార్పొరేటర్ స్థానాలు గెలిచి చూపించాలని ఆయన సవాల్ విసిరారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలం ఎంతుందో వాస్తవంగా అంచనా వేసుకోవాలని, ఇలాంటి అతివిశ్వాస ప్రకటనల వల్ల కిందిస్థాయి కార్యకర్తల్లో తీవ్ర అయోమయం నెలకొంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బూత్ స్థాయి కార్యకర్తలను బలోపేతం చేయకుండా విజయాలు సాధ్యం కావని ఆయన కుండబద్దలు కొట్టారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరిస్థితిపైనా రాజాసింగ్ సానుభూతి వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి చేతులు కట్టేసి పనిచేయమంటే ఆయన మాత్రం ఎలా చేయగలరని ప్రశ్నించారు. పార్టీలో కొద్దిమంది నేతల వ్యక్తిగత ఈగోలు, అంతర్గత విభేదాలు సంస్థాగతంగా తీవ్ర నష్టం చేస్తున్నాయని, ఈ పరిణామాలను వెంటనే ఢిల్లీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. పార్టీలో ఏ నిర్ణయమైనా ఒక్క వ్యక్తి చుట్టూ తిరగడం మానుకుని, మొత్తం కేడర్ ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటేనే పార్టీకి భవిష్యత్తు ఉంటుందని రాజాసింగ్ స్పష్టం చేశారు.



# చల్లారని పశ్చిమాసియా

**ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు**

**కువైట్‌లో యూఎస్ స్థావరాలపై ఇరాన్ ప్రతీకారం!**

**ఇద్దరు అమెరికా సైనికుల మృతితో ట్రంప్ ఆదేశాల మేరకు దాడులు**

**అణ్వాయుధ నిరోధమే లక్ష్యమన్న వైట్ హౌస్**

గ్లోబల్ డెస్క్, జులై 19: అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతోంది. ఇరు దేశాల ప్రతీకారదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. జోర్డాన్‌లో ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించిన నేపథ్యంలో, అగ్రరాజ్యం అమెరికా ఆదివారం ఇరాన్‌పై మరోసారి విరుచుకుపడింది. వరుసగా ఎనిమిదో రాత్రి కూడా ఈ దాడులను కొనసాగించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్ష ఆదేశాల మేరకు జరిగిన ఈ ఆపరేషన్‌లో.. జోర్డాన్‌లోని తమ సైనికులపై దాడికి తెగబడిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ బలగాలను మట్టుబెట్టడమే ప్రధాన లక్ష్యమని పేర్కొంది. దీనితో పాటు, వ్యూహాత్మక హర్మ్యాజ్ జలసంధిలో అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలకు ముప్పు కలిగించేలా ఉన్న ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమే ఈ తాజా దాడుల వెనుక ఉన్న అసలు ఉద్దేశమని అమెరికా రక్షణ వర్గాలు స్పష్టం చేశాయి. మరోవైపు అమెరికా వైమానిక దాడులకు ప్రతీకారంగా తాము కూడా కువైట్‌లోని రెండు కీలక యూఎస్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులతో విరుచుకుపడ్డామని ఇరాన్ ఆదివారం ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో కువైట్‌లోని క్యాంప్ ఉద్దెరిలో గల మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రంతో పాటు, అలీ అల్ సలేం ఎయిర్ బేస్‌లోని అధునాతన పేట్రియట్ రాడార్ వ్యవస్థ, వైమానిక నిఘా రాడార్‌లను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఇరాన్ సైన్యం వెల్లడించింది. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న ఈ ఉద్రిక్త పరిస్థితుల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు; అవగాహన ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు టెహ్రాన్ చేసిన ప్రకటనను లేదా ఒప్పంద ఉల్లంఘనలను తాను పెద్దగా ఖాతరు చేయనని, అయితే ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు తయారు చేయకుండా పూర్తిగా నిలువరించడమే తమ ఏకైక మరియు తుది లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# గాయపడిన గీత కార్మికుడిని పరామర్శించిన శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, జూలై 19 : నల్గొండ జిల్లా దోమలపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు సత్తయ్య గౌడ్ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్‌కు అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం నుంచి పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉ ంటామని భరోసా ఇచ్చారు. చెట్టుపై నుంచి పడి పది రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎవరూ బాధితుడిని పరామర్శించకపోవడం బాధాకరమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ విషయమై నల్గొండ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, ప్రభుత్వం తరఫున అందాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి మరణించినా లేదా తీవ్రంగా గాయపడినా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

**మహేష్ కుమార్ గౌడ్**

**నిర్లక్ష్యాన్ని సహించేది**

**లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు**

**ఆగస్టు 3 వరకు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచన**

హైదరాబాద్, జూలై 19

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని, అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచిం చారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులందరూ ఎస్ఐఆర్ ప్రక్రియపైనే పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పనులను వేగవంతం చేసి బూత్ స్థాయి ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించా లని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవా లని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ నాయకులు ఎంత అంకితభావంతో పనిచేస్తారో, అదే స్థాయిలో ఇప్పుడు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉండి ప్రతి దశను పర్యవేక్షించా లని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడటం ప్రతి నాయకుడి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు

హైదరాబాద్,

హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల అంశం కలకలం రేపింది. కానిస్టేబుల్ స్థాయి నుంచి సివిల్ సర్వీసెస్‌లో విజేతగా నిలిచిన యువ ఐపీఎస్ నిందితుడు కావటం చర్చనీయాంశంగా మారింది. ఓ ట్రైనీ ఐపీఎస్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం రాత్రి నగరంలోని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహిళ (30) ఐపీఎస్ కు ఎంపికయ్యారు. ప్రస్తుతం నగరంలోని శివరాంపల్లిలో నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్నారు. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి కూడా ఇక్కడే ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణలో ఉన్నాడు. ఈ ఏడాది జూన్ 23 నుంచి అతడు మహిళా ట్రైనీ ఐపీఎస్ వాట్సప్ నంబరుకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ లైంగికంగా వేధించడం ప్రారంభించాడు. ఆమె గౌరవాన్ని దెబ్బతీసేలా అకాడమీలో స్నేహితుల ఎదుట తెలుగులో ఇబ్బందికరమైన పదాలతో అమర్యాదకరంగా మాట్లాడాడు. ఆమెకు వేరే వారితో వివాహేతర సంబంధం అంటగట్టి ప్రచారం చేసి మనోవేదనకు గురిచేశాడు. బలవంతంగా ఆమె మొబైల్ లాక్కొని వ్యకిగత మెసేజ్‌లను చూసి ఇబ్బందికి గురిచేశాడు. ఈ నెల 8న బలవంతంగా అతడి గదిలోకి లాక్కెళ్లి బెదిరించి, భయపెట్టి ఫోన్ పాస్‌వర్డ్



సేకరించాడు. 9న రాత్రి 9 గంటలకు మరోసారి బలవంతంగా తనను జుట్టు పట్టుకొని అతడి గదిలోకి గుంజుకెళ్లాడు. గొంతు పిసికి, మెడపై కత్తి పెట్టి బెదిరించాడు. 10న రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె వ్యక్తిగత వీడియోలను చిత్రీకరించి భర్తకు పంపి బెదిరింపులకు పాల్పడ్డాడు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉదయ్ కృష్ణారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉదయ్‌కృష్ణారెడ్డి శిక్షణ సమయంలో సహచరులతో ఇబ్బందికరంగా ప్రవర్తించేవాడని, వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి తప్పుడు సందేశాలతో కొందరిని మనోవేదనకు గురిచేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. శిక్షణలోనే అనుచిత ప్రవర్తనతో కేసులో ఇరుక్కోవడంతో అతడి ఐపీఎస్ హోదాపై అనిశ్చితి నెలకొంది.

**స్ఫూర్తిగా నిలిచి.. ప్రవర్తనతో పతనమై..**

ఉదయ్ కృష్ణారెడ్డి స్వస్థలం సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామం. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించడంతో నానమ్మ చెంత పెరిగాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. కూరగాయలు అమ్ముతూ నానమ్మకు చేదోడుగా నిలిచాడు. 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. 2018 వరకు విధులు నిర్వర్తించాడు. అదే సమయంలో ఓ సీఐ తోటి వారి ముందు ఉదయ్‌ను అవమానిస్తూ మాట్లాడటంతో భరించలేకపోయాడు. ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్‌కు సిద్ధమయ్యాడు. నాలుగుసార్లు పరాజయాలు ఎదురైనా పట్టుదలతో ఐదోసారి 360 ర్యాంకుతో విజేతగా నిలిచి ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. శిక్షణ పూర్తిచేసుకొని పోలీసు అధికారిగా బాధ్యతలు చేపట్టాల్సిన ఉదయ్‌కృష్ణారెడ్డి ఇప్పుడు లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్నాడు.






# ప్రధాని నరేంద్ర మోడీ గారిచే ఆగస్టు 1న ఎయిర్పోర్ట్ ప్రారంభం

**ఆంధ్రప్రదేశ్ కు భాగ్యనగరం కానున్న మన భోగాపురం**

**అల్లూరి పేరుతో ఎయిర్పోర్ట్ జాతికి అంకితం**

**జగన్ పార్టీ క్రెడిట్ చోరీకి సిద్ధం**

**పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌గారు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్ఫెడ్ చైర్మన్ బంగారు రాజు, కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్ గార్లు, ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులు.**



విజయనగరం, జులై 19, ఉత్తరాంధ్ర ప్రజల ఎమోషన్ అయిన అధునాతన హంగులతో నిర్మించబడిన భోగాపురం విమానాశ్రయం ఎయిర్పోర్ట్ ఆగస్టు 1 వ తేదీన దేశ ప్రధాని మోడీ గారిచే ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం భోగాపురం ఎయిర్పోర్ట్ పరిసర ప్రాంతాలను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్ఫెడ్ చైర్మన్ బంగారు రాజు, కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ గారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో ప్రపంచంలోనే అత్యంత అద్భుత విమానాశ్రయాలలో ఒకటిగా ఖ్యాతి గడించబోయే భోగాపురం శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1 న ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. నాటి కేంద్ర పౌర విమాన శాఖామాత్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు గారు ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో శంకుస్థాపన చేశారని, ఆ కల నేడు సాకారం కావడం ఈ ప్రాంత అభివృద్ధికి చిహ్నంగా మారనుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర పౌర విమాన శాఖ మాత్యులు రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో మంత్రులు, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఉత్తరాంధ్ర ప్రజల హర్షధ్వానాల మధ్య పతాక స్థాయిలో చిరస్థాయిగా గుర్తుండే విధంగా బోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం చేయటం జరుగుతుందన్నారు. తెలంగాణ కు హైదరాబాద్ భాగ్యనగరంగా పేరుపొందినట్లే రానున్న రోజులలో భోగాపురం ఎయిర్పోర్ట్ తో ఆంధ్రప్రదేశ్ భాగ్యనగరంగా ఉత్తరాంధ్ర విరాజిల్లుతుందన్నారు. ఇప్పటికే విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు జాతీయ రహదారులు అందుబాటులోకి రావడంతో పాటు బోగాపురం ఎయిర్పోర్ట్ రావడంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో ఇప్పటికే గూగుల్, జిందాల్, ఆర్ ఎస్ ఆర్ మిత్తల్ నిప్పల్ స్టీల్ కంపెనీ తో పాటు అనేక పరిశ్రమలు స్థాపించడంతో పాటు రానున్న రోజులలో అనేక పరిశ్రమలను తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, యువ నాయకులు నారా లోకేష్ గారు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, యువ నాయకులు లోకేష్ గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభానికి ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు. కాకినాడ నుండి మూలపేట వరకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పరచడానికి ముఖ్యమంత్రి గారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎర్ర బస్సు కూడా రాదన్న జగన్ రెడ్డి తో పాటు భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభించిన వెంటనే క్రెడిట్ చోరీతో ఎయిర్పోర్ట్ మేమే కట్టామని అబద్ధాలు చెప్పటానికి వైకాపా నాయకులు సిద్ధంగా ఉంటారన్నారు.

విశాఖ శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను పార్కింగ్ చేసే స్థలాలను, నిర్మాణ స్థాయిలో ఉన్న అప్రోచ్ రోడ్లను, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, సభా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సభా ప్రాంగణంలో ప్రాంతానికి పేరు తెచ్చి పెట్టిన తప్పెటగుళ్ళు, కోలాటం, గిరిజన సాంప్రదాయ నృత్యాల కళాకారులతో అబ్బురపరిచే విధంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల కలల స్వప్నంగా ఉన్న భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. మార్క్ ఫెడ్ చైర్మన్ బంగారు రాజు మాట్లాడుతూ బోగాపురం ఎయిర్పోర్ట్ కోసం స్థలాలు ఇచ్చిన రైతులందరికీ కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రధాని మోడీ గారి సమావేశానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ప్రధానమంత్రి బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రధానమంత్రి పర్యటనలో వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించడం జరిగిందనీ, సుమారు 3000 వాహనాలు వస్తాయని అంచనా తో పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. ప్రధాని విమానాశ్రయ ప్రారంభ పర్యటనకు బందోబస్తు నాలుగు సెక్టార్లుగా విభజించడం జరిగిందనీ, బహిరంగ సభకు సభ వేదిక గుర్తించి అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎ ఆర్ దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ‘వందేమాతరం’ గేయాన్ని అవమానిస్తే.. మూడేళ్ల జైలు

న్యూఢిల్లీ,

జాతీయ గేయం ‘వందేమాతరం’ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణించనున్నారు. ఈ మేరకు పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా తొలిరోజే (సోమవారం) ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ‘ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్ (సవరణ)–2026’ బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 1971 నాటి చట్టం ప్రకారం జాతీయ చిహ్నాలతోపాటు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానపరచడం చట్టరీత్యా నేరం. దీనికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడొచ్చు. తాజాగా ఆ చట్టానికి సవరణ చేయడం ద్వారా ఆ జాబితాలో ‘వందేమాతరం’ గేయాన్ని చేర్చనున్నారు. ఈ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వందేమాతరానికి.. జాతీయ గీతం ‘జన గణ మన’తో సమాన హోదా కల్పించేందుకు ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొస్తోంది. ఈ గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ రచించారు. తొలిసారి ఛటర్జీ రాసిన ‘ఆనంద్ మఠ్’ నవలలో ప్రచురితమైంది.



## పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయండి

### పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్

న్యూఢిల్లీ,

‘పార్లమెంట్ మార్చ్’ (పార్లమెంట్ వరకు నిరసన ర్యాలీ)ను విజయవంతం చేయాలని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. తనను ఆస్పత్రిలో అక్రమంగా నిర్బంధించారని ఆయన ఆక్షేపించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌లో 21 రోజులుగా చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసిన పోలీసులు.. ఆయన్ని ఆసుపత్రిలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెల్లకాగితంపై వాంగ్‌చుక్ రాసిన సందేశాన్ని భార్య గీతాంజలి ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం (జులై 20) చేపట్టదలచిన నిరసన ర్యాలీలో పాల్గొనాలని మద్దతుదారులను వాంగ్‌చుక్ కోరారు. తన నిరాహార దీక్షగానీ, కాక్రోచ్ జనతాపార్టీ చేపట్టనున్న ‘పార్లమెంట్ మార్చ్’గానీ అన్యాయం నుంచి విముక్తి కోసమేనని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు ‘పార్లమెంట్ మార్చ్’కు పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించినట్లు సమాచారం.

**నిలకడగా ఆరోగ్యం**

వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. నిపుణులైన వైద్యుల బృందం ఆయన్ని నిశితంగా పరిశీలిస్తోందని ఆస్పత్రి యాజమాన్యం బులెటిన్ విడుదల చేసింది. దీర్ఘకాలం పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చిన్నపాటి సమస్యలు తలెత్తాయని పేర్కొంది. మరోవైపు దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు.. అత్యవసర వైద్య సేవలు అందించేందుకే వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్‌లోని దీక్షా స్థలి నుంచి ఆస్పత్రికి తరలించినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు.

**వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడం సరైందే: దిల్లీ హైకోర్టు**

సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో ఆయన్ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించడం ఏకపక్షమైన నిర్ణయం కాదని దిల్లీ హైకోర్టు తెలిపింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. వాంగ్‌చుక్‌ను నిర్బంధించారన్న వాదనను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఆయన స్వేచ్ఛగానే ఉన్నారని.. ఆసుపత్రిలోని వైద్యులు ఆయన సమ్మతితోనే చికిత్స చేశారని పేర్కొంది. సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌ను నిర్బంధించారని.. ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో దిల్లీ హైకోర్టు ను ఆశ్రయించారు. తన భర్తను ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఆయనను అక్రమంగా నిర్బంధించారని పిటిషన్‌లో ఆరోపించారు. ఆయనకు చికిత్స అందించిన వ్యక్తిగత వైద్యులు, న్యాయవాదులను కలిసే అవకాశం కల్పించాలని కోరారు. 21 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్షా శిబిరం నుంచి పోలీసులు వాంగ్‌చుక్‌ను శనివారం సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ కూడా ఆయన దీక్ష కొనసాగిస్తున్నారని ఆంగ్మో తెలిపారు.



# గాయపడిన గీత కార్మికుడిని పరామర్శించిన శ్రీనివాస్ గౌడ్

### ఆసుపత్రిలో బాధితుడికి ధైర్యం

### రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని డిమాండ్

### గీత కార్మికులకు అండగా నిలవాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 19**

నల్గొండ జిల్లా దోమలపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు సత్తయ్య గౌడ్ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్‌కు అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం నుంచి పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**చెట్టుపై నుంచి పడి పది రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎవరూ బాధితుడిని పరామర్శించకపోవడం బాధాకరమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ విషయమై నల్గొండ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, ప్రభుత్వం తరపున అందాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి మరణించినా లేదా తీవ్రంగా గాయపడినా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.**

రాష్ట్రవ్యాప్తంగా చెట్టుపై నుంచి పడి సుమారు 600 మంది గీత కార్మికులు ప్రమాదాలకు గురయ్యారని పేర్కొన్న శ్రీనివాస్ గౌడ్, వారందరికీ ఎలాంటి జాప్యం లేకుండా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదాల నివారణకు కూడా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గీత పారిశ్రామిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, రామ్మూర్తి, ఇతర నాయకులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహకారం అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.



# గుండం జలపాతంలో యువకుడి మృతి

### హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుడి విషాదాంతం

### పది రోజుల్లో ఇద్దరు పర్యాటకుల మృతి

### భద్రతా చర్యలపై స్థానికుల ఆందోళన

**ములుగు, జూలై 19**

ములుగు జిల్లాలోని గుండం జలపాతం వద్ద ఆదివారం మరో విషాద ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన అక్తరుద్దీన్ అనే యువకుడు జలపాతంలో మునిగి మృతి చెందాడు. జలపాతం సందర్శనకు స్నేహితులతో కలిసి వచ్చిన ఆయన నీటిలోకి దిగిన సమయంలో ప్రమాదానికి గురైనట్లు సమాచారం. జలపాతం లోతును సరిగా అంచనా వేయలేక అక్తరుద్దీన్ నీటిలో మునిగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆయనను గమనించిన స్నేహితులు, స్థానిక గ్రామస్థులు వెంటనే నీటిలోకి దిగి బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. యువకుడిని బయటకు తీసిన అనంతరం సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ చేపట్టారు. గత పది రోజుల వ్యవధిలో ములుగు జిల్లాలోని జలపాతాల్లో ఇద్దరు పర్యాటకులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ జలపాతాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం పర్యాటకులను కలవరపెడుతోంది. జలపాతాల వద్ద రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులు, భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయడంలో అటవీశాఖ విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోవద్దు

## మహేష్ కుమార్ గౌడ్

### ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

### నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు

### ఆగస్టు 3 వరకు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచన

**హైదరాబాద్, జూలై 19**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని, అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి



ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులందరూ ఎస్ఐఆర్ ప్రక్రియపైనే పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పనులను వేగవంతం చేసి బూత్ స్థాయి ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ నాయకులు ఎంత అంకితభావంతో పనిచేస్తారో, అదే స్థాయిలో ఇప్పుడు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉండి ప్రతి దశను పర్యవేక్షించాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడటం ప్రతి నాయకుడి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# భూ రీ సర్వే వేగవంతం

### నిర్ణీత గడువులో పనుల పూర్తి

### శాఖల సమన్వయానికి మంత్రి ఆదేశం

### శ్రీనివాసగుట్ట అభివృద్ధికి ప్రణాళిక

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపడుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సారపాకలోని ఐటీసీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనుల పురోగతి, అటవీ-రెవెన్యూ భూ వివాదాలు, పోడు భూముల సమస్యలు, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

**ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూ రికార్డులను శాశ్వతంగా క్రమబద్ధీకరించే ఈ కార్యక్రమంలో ఎక్కడా నిర్లక్ష్యం, జాప్యం లేదా లోపాలకు అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం లక్ష్యాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 14 గ్రామాల్లో భూ రీ-సర్వే పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఇప్పటికే ఐదు గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిర్ణయించిన గడువులోపే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు, రోవర్ పరికరాలు, సాంకేతిక సిబ్బంది కొరత తలెత్తకుండా ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని చెప్పారు. భూ యజమానుల అభ్యంతరాలను వెంటనే పరిశీలించి చట్టబద్ధంగా పరిష్కరించాలని, ఎక్కడా వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. అటవీ-రెవెన్యూ శాఖల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని మంత్రి పేర్కొన్నారు. రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పురోగతిని పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టబద్ధమైన విధానంలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ శాఖ నిర్లక్ష్యం వల్ల కూడా పనులు నిలిచిపోకుండా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పోడు భూముల అంశంపై కూడా మంత్రి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో గతంలో పోడు సాగు చేస్తున్న కుటుంబాల సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించారు.

**అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అటవీ సంపద పరిరక్షణతో పాటు గిరిజనుల జీవనోపాధి అంశాలను కూడా సమతుల్యంగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూనే ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వివాదాస్పద భూములపై స్థానిక స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.**

పాల్వంచలోని శ్రీనివాసగుట్టను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. గుట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా నాణ్యమైన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాలు, తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు, పార్కింగ్, విద్యుత్ వెలుగులు, పరిశుభ్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో జిల్లా ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని మంత్రికి వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పనిలో నాణ్యత, పారదర్శకత, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. భూ రీ-సర్వే పూర్తయిన తర్వాత జిల్లాలో భూ రికార్డుల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని, భూ వివాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు సమావేశంలో అభిప్రాయపడ్డారు.

# సింధుకు గవర్నర్ అభినందనలు

### జపాన్ ఓపెన్ విజేతకు ప్రశంసలు

### దేశానికి గర్వకారణమన్న గవర్నర్

### యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా అభివర్ణన

**హైదరాబాద్, జూలై 19**

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అభినందనలు తెలిపారు. జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారత క్రీడాకారిణిగా నిలవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. పి.వి. సింధు సాధించిన ఈ ఘన విజయం ఆమె అసాధారణ ప్రతిభ, కఠోర శ్రమ, అంకితభావానికి నిదర్శనమని గవర్నర్ కొనియాడారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ అంతర్జాతీయ వేదికపై మరోసారి భారత జెండాను రెపరెపలాడించడం గొప్ప విజయమని అన్నారు. సింధు చారిత్రాత్మక విజయం దేశ ప్రజలందరికీ ఆనందాన్ని కలిగించిందని గవర్నర్ పేర్కొన్నారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఉన్న యువ క్రీడాకారులకు ఈ విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.



అంతర్జాతీయ క్రీడల్లో భారత కీర్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో పి.వి. సింధు కీలక పాత్ర పోషిస్తున్నారని గవర్నర్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఆమె ఇలాంటి విజయాలను కొనసాగించి దేశానికి మరిన్ని కీర్తిపతాకలు అందించాలని ఆకాంక్షించారు. పి.వి. సింధు విజయంతో భారత బ్యాడ్మింటన్‌కు ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు లభించిందని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. వరుస విజయాలతో భారత క్రీడాకారులకు ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా భారత బ్యాడ్మింటన్ చరిత్రలో పి.వి. సింధు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ విజయంతో దేశవ్యాప్తంగా ఆమెకు రాజకీయ, క్రీడా, సామాజిక రంగాల ప్రముఖుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.





# శేఖర్ స్మారక అవార్డుల ప్రదానం

### సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వేడుక

### కళాకారులను సత్కరించిన కేటీఆర్

### కళలకు ప్రోత్సాహమే సమాజ బాధ్యత

**హైదరాబాద్, జూలై 19**

ప్రముఖ కార్టూనిస్ట్ కంబాలపల్లి శేఖర్ స్మారకార్థం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డ్స్--2026 ప్రదానోత్సవంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్టూన్, చిత్రలేఖన రంగాల్లో విశిష్ట సేవలు అందించిన కళాకారులను సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు, రచయితలు, కవులు, పాత్రికేయులు, చిత్రకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళా రంగానికి సేవలందించిన వారి కృషిని గుర్తించి సత్కరించడం సమాజ బాధ్యత అని కేటీఆర్ పేర్కొన్నారు. కళాకారుల ప్రతిభను మరింత ప్రోత్సహించే వేదికలు పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కంబాలపల్లి శేఖర్ గీసిన కార్టూన్లు, చిత్రాలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంలో కీలక పాత్ర పోషించాయని కేటీఆర్ గుర్తు చేశారు. సామాజిక, రాజకీయ అంశాలను తన కలంతో ప్రజలకు చేరువ చేసిన అరుదైన కళాకారుడిగా శేఖర్ నిలిచిపోయారని కొనియాడారు. ఆయన కార్టూన్లు కేవలం వినోదానికి పరిమితం కాకుండా సమాజంలో చైతన్యం నింపాయని అన్నారు. ఉద్యమ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శేఖర్ సృజనాత్మకతకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. అలాంటి కళాకారులను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

ఈ సందర్భంగా కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం. నారుకు, ఆర్టిస్ట్ విభాగంలో చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్‌కు కేటీఆర్ ఇతర అతిథులతో కలిసి శేఖర్ మెమోరియల్ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను అభినందిస్తూ వారి సృజనాత్మక ప్రయాణం మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కళా రంగంలో వారి సేవలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కళాకారుల కృషికి సమాజం తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు. ఇటువంటి అవార్డులు కళారంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో ఒకే వేదికపై కలుసుకునే అవకాశాలు చాలా అరుదుగా వస్తాయని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ ఉద్యమ కాలం నాటి ఎన్నో జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసిందని చెప్పారు. ఉద్యమ సమయంలో సాంస్కృతిక రంగం పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సాహిత్యం, చిత్రకళ, కార్టూన్లు ప్రజల్లో చైతన్యాన్ని పెంచడంలో ఎంతో ప్రభావం చూపాయని పేర్కొన్నారు. సమాజ మార్పులో కళాకారుల పాత్ర ఎంతో విలువైనదని అన్నారు.

కళను ప్రోత్సహించడం ప్రభుత్వాలకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న కళాకారులకు తగిన అవకాశాలు కల్పిస్తే దేశ సాంస్కృతిక సంపద మరింత విస్తరిస్తుందని చెప్పారు. యువ కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని సూచించారు. సృజనాత్మకతకు ప్రోత్సాహం లభిస్తే కొత్త తరానికి మరింత ఉత్సాహం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. కళా, సాహిత్య రంగాల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఏడాది నుంచి శేఖర్ మెమోరియల్ అవార్డులను మరింత ఘనంగా నిర్వహించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ అవార్డులు రాష్ట్రంలోని ప్రతిభావంతులైన కళాకారులకు మరింత ప్రేరణగా నిలిచేలా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, అతిథులను అభినందించిన ఆయన, కంబాలపల్లి శేఖర్ సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ప్రయత్నాలకు తన మద్దతు కొనసాగుతుందని తెలిపారు.



# అభివృద్ధి పనులకు శ్రీకారం

### కామేపల్లిలో శంకుస్థాపనలు చేసిన భట్టి

### విద్యుత్, రహదారి పనులకు ప్రాధాన్యం

### ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం

**ఖమ్మం, జూలై 19**

ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలంలో విద్యుత్, రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజల సమక్షంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణతో వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెంచుతున్నట్లు వెల్లడించారు.

> **రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలు కూడా వేగవంతమవుతాయని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వంటి రంగాలకు మెరుగైన రహదారులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, మెరుగైన రహదారులు, వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ సమానంగా చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణ కొనసాగుతుందని తెలిపారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు వేగంగా మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు, తాగునీరు, రవాణా వంటి రంగాల్లో మరిన్ని పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు. కామేపల్లి మండలంలో చేపట్టనున్న ఈ పనులు పూర్తయిన తర్వాత విద్యుత్, రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపడి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.









# పుష్కరాల నాటికి భద్రాద్రి సిద్ధం

## పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి.. అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

### భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**భద్రాచలం, జూలై 19**

వచ్చే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాలు ప్రారంభానికి 15 రోజుల ముందే క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆదివారం భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ విస్తరణ, పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. భద్రాద్రి ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ఎలాంటి భంగం కలగకుండా నిపుణులైన



శిల్పులతో అత్యున్నత నాణ్యతా ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పురాతన గోపురాలు, ఆలయ నిర్మాణాల సహజత్వాన్ని కాపాడుతూ ఆగమశాస్త్రాల ప్రకారం పనులు జరగాలని సూచించారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చోట అదనపు కార్మికులను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు మంత్రి ఆదేశించారు. ప్రతి పది రోజులకోసారి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి సాంకేతిక అనుమతులు, ప్రణాళికల అమలులో జాప్యానికి తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి అన్ని సౌకర్యాలను కల్పించాలని మంత్రి ఆదేశించారు. గోదావరి పుష్కరాల దృష్ట్యా కొత్త స్నాన ఘట్టాల నిర్మాణం, యాత్రికుల వసతి సదుపాయాల విస్తరణకు కూడా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఆలయ కార్యనిర్వహణాధికారి దామోదరరావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొండచరియలు విరిగిపడి ఎనిమిదిమంది మృతి

**ఇంటర్నెట్ డెస్క్, జూలై 19**

నాగాలాండ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వీటి కారణంగా మోన్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. మరో 12 మందికి గాయాలయ్యాయి. పది నుంచి పదిహేను ఇళ్లు దెబ్బతినగా.. శిథిలాల కింద మరింత మంది ఉండవచ్చని భావిస్తున్నారు. నాగాలాండ్ పోలీసులు సహా అస్సాం రైఫిల్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నాయి.

**రూమ్‌మేట్స్ నుంచి రాకెట్ రూపకల్పన వరకు!**

ఆదివారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మోన్ జిల్లా కేంద్రం వణికిపోయింది. అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లు, రోడ్లు, మౌలికసదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది.




# చరిత్ర సృష్టించిన రోహిత్-కోహ్లీ జోడీ

## కలిసి 400 అంతర్జాతీయ మ్యాచ్‌ల మైలురాయి

**లండన్, జూలై 19, 2026**

భారత మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో వన్డేలో బరిలోకి దిగిన ఈ స్టార్ జోడీ కలిసి 400 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన తొలి భారత క్రికెటర్లుగా చరిత్ర సృష్టించింది. టీ20, టెస్టు క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌పైనే దృష్టి సారించారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈ ఇద్దరూ లార్డ్స్ వన్డేలో ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషంగా నిలిచింది. ఇప్పటివరకు ఏ భారత జోడీ కూడా ఈ ఘనత సాధించలేదు. విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 562 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 28,285 పరుగులు సాధించాడు. 85 సెంచరీలు నమోదు చేసిన కోహ్లీ అత్యధిక వ్యక్తిగత స్కోరు 254 నాటౌట్. మరోవైపు రోహిత్ శర్మ 514 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 20,289 పరుగులు చేశాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 112 అర్ధసెంచరీలు నమోదు చేసిన రోహిత్ అత్యధిక వ్యక్తిగత స్కోరు 264 పరుగులు. భారత క్రికెట్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ ఇద్దరు దిగ్గజాలు మరో చారిత్రక రికార్డును తమ పేరిట నమోదు చేసుకోవడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



### జపాన్ ఓపెన్ విజేతగా

# పీవీ సింధు..

## చరిత్ర సృష్టించిన భారత షట్లర్

**టోక్యో, జూలై 19, 2026**

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని, ఈ ప్రతిష్టాత్మక టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. ఫైనల్‌లో ఆతిథ్య దేశం జపాన్‌కు చెందిన స్టార్ క్రీడాకారిణి అకానే యమగుచిపై సింధు అద్భుత ప్రదర్శన చేసింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 21-17, 21-17 తేడాతో వరుస గేమ్‌ల్లో విజయం సాధించి టైటిల్‌ను అందుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు, తన శక్తివంతమైన స్మాష్‌లు, కచ్చితమైన క్రాస్ కోర్ట్ డ్రాప్స్‌తో యమగుచిపై ఆధిపత్యం చెలాయించింది. తొలి గేమ్‌లో కీలక సమయాల్లో వరుస పాయింట్లు సాధించి 21-17తో గెలిచిన ఆమె, రెండో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించింది. యమగుచి నెట్ గేమ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ మరోసారి 21-17తో గేమ్‌ను ముగించి టైటిల్‌ను ఖాయం చేసింది. ఈ విజయంతో జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలిచిన తొలి భారత షట్లర్‌గా పీవీ సింధు చరిత్రలో నిలిచింది. 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ అనంతరం సింధు సాధించిన తొలి అంతర్జాతీయ టైటిల్ ఇదే కావడం విశేషం. ఆమె ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందని, రానున్న అంతర్జాతీయ టోర్నీల్లో కూడా ఇదే జోరును కొనసాగించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.






# ఎంఎల్‌సీ చాంపియన్‌గా లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్

## షారుక్ ఖాన్ ఆనందం

**లాస్ ఏంజెలెస్, జూలై 19, 2026**

బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్ సహ యజమానిగా ఉన్న లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ (ఎల్ఏకేఆర్) అమెరికా మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)-2026 టోర్నీలో తొలిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఓక్‌లాండ్ కొలీజియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌పై ఒక్క పరుగు తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 164 పరుగులు చేసింది. సునీల్ నరైన్, జాసన్ హోల్డర్ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు పోరాడే స్కోరు అందించారు. అనంతరం 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్ ఫ్రీడమ్ చివరి బంతి వరకు విజయం కోసం పోరాడినా, 163 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లలో షాడ్లీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి నైట్ రైడర్స్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. జట్టు విజయం అనంతరం షారుక్ ఖాన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. టోర్నీలో పాల్గొనడానికే కాకుండా విజేతలుగా నిలవడానికే వచ్చామని ఆటగాళ్లు నిరూపించారని కొనియాడారు. సునీల్ నరైన్, జాసన్ హోల్డర్, ఆండ్రీ రస్సెల్‌తో పాటు జట్టులోని ప్రతి ఆటగాడికి అభినందనలు తెలుపుతూ, "మీరు మైదానంలో అద్భుతం చేశారు... లవ్ యూ ఆల్... కోర్బో.. లోర్బో.. జీత్బో" అంటూ నైట్ రైడర్స్ నినాదాన్ని పంచుకున్నారు. ఇటీవల లాస్ ఏంజెలెస్‌లో ప్రతిష్ఠాత్మక నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ను ప్రారంభించిన షారుక్ ఖాన్, అమెరికాలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి ప్రవేశించనున్న నేపథ్యంలో, ఎంఎల్‌సీలో లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ సాధించిన ఈ చారిత్రక విజయం అమెరికాలో క్రికెట్‌కు మరింత ఆదరణ తీసుకువస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కాంస్య పతకం ఇంగ్లండ్ సొంతం

## ఎంబాపేకు చారిత్రక రికార్డు

**న్యూయార్క్, జూలై 19, 2026**

ఫిఫా ప్రపంచకప్-2026లో మూడో స్థానం కోసం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఇంగ్లండ్ 6-4 తేడాతో ఫ్రాన్స్‌ను ఓడించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. బుకాయో సాకా హ్యాట్రిక్‌తో చెలరేగగా, డెక్లాన్ రైస్, ఎబ్రీ కాన్సా, జూడ్ బెల్లింగ్హామ్ చెరో గోల్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచకప్ చరిత్రలో ఇంగ్లండ్ కాంస్య పతకం గెలవడం ఇదే తొలిసారి. 1966లో ప్రపంచకప్ విజేతగా నిలిచిన తర్వాత మళ్లీ ప్రపంచకప్ పతకం దక్కడం విశేషం. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇంగ్లండ్ ఆధిపత్యం ప్రదర్శించింది. మూడో నిమిషంలో డెక్లాన్ రైస్ తొలి గోల్ నమోదు చేయగా, 18వ నిమిషంలో ఎబ్రీ కాన్సా ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. అనంతరం బుకాయో సాకా వరుసగా రెండు గోల్స్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇంగ్లండ్ 4-0తో పటిష్ట ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబాపే తన ప్రతిభను చాటాడు. 48, 67వ నిమిషాల్లో రెండు గోల్స్ చేయగా, బ్రాడ్లీ బార్కోలా మరో గోల్‌తో ఫ్రాన్స్ స్కోరును 4-3కు చేర్చింది. ఈ రెండు గోల్స్‌తో ఎంబాపే ప్రపంచకప్ చరిత్రలో అత్యధికంగా 22 గోల్స్ చేసిన ఆటగాడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. అలాగే ఈ టోర్నీలో తన గోల్స్ సంఖ్యను 10కు చేర్చి గోల్డెన్ బూట్ రేసులోనూ అగ్రస్థానంలో నిలిచాడు. ఫ్రాన్స్ సమం చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఇంగ్లండ్‌కు లభించిన పెనాల్టీని సాకా గోల్‌గా మలిచి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. అదనపు సమయంలో ఫ్రాన్స్ తరఫున ఉస్మాన్ డెంబెలే గోల్ చేసినా, చివర్లో జూడ్ బెల్లింగ్హామ్ మరో గోల్‌తో ఇంగ్లండ్ విజయం ఖాయం చేశాడు. దీంతో 6-4 స్కోరుతో గెలిచిన ఇంగ్లండ్ ప్రపంచకప్‌ను మూడో స్థానంతో ముగించగా, ఎంబాపే వ్యక్తిగత రికార్డు సాధించినా ఫ్రాన్స్‌కు ఓటమి తప్పలేదు.




# సోషల్ మీడియాకు దూరంగా ఉండండి

## టీమిండియాకు బీసీసీఐ సూచన

**లండన్, జూలై 19, 2026**

ఇంగ్లండ్‌తో నిర్ణయాత్మక మూడో వన్డేకు ముందు భారత క్రికెట్ జట్టుకు బీసీసీఐ కీలక సూచనలు చేసింది. మ్యాచ్‌ల సమయంలో సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండి ఆటపై పూర్తి దృష్టి సారించాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఆట గాళ్లకు సూచించారు. లండన్‌లోని ఇండియా హౌస్‌లో భారత హైకమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో దాదాపు ప్రతి ఒక్కరూ తమను క్రికెట్ నిపుణులుగా భావిస్తారని, సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, సలహాలు ఆటగాళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అందువల్ల వాటిని పట్టించుకోకుండా ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించారు. టీమిండియాలో అపారమైన ప్రతిభ ఉందని, ప్రతి ఆటగాడికి మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థ్యం ఉందని ప్రశంసించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, తన నియంత్రణలో ఉన్న అంశాలపైనే దృష్టి పెడతానని తెలిపాడు. మైదానంలోనూ, బయటా ఒత్తిడిని అధిగమించేందుకు బాహ్య ప్రభావాలకు దూరంగా ఉండటం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. మూడో వన్డేలో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన గాయాల సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న సమయంలో సహచర ఆటగాళ్లు తరచూ ఫోన్ చేసి ధైర్యం చెప్పారని, వారి ప్రోత్సాహమే త్వరగా కోలుకుని తిరిగి జట్టులోకి రావడానికి బలం ఇచ్చిం దని వెల్లడించాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ, భారత క్రికెట్ జట్టు కేవలం డ్రెస్సింగ్ రూమ్‌లోని ఆటగాళ్లది మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా జట్టును నిస్వార్థంగా ఆదరించే ప్రతి భారత అభిమాని సొత్తని అన్నారు. భారత హైకమిషనర్ పి. కుమరన్ కూడా జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల క్రీడా రంగంలోనూ కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో టాలీవుడ్ జైత్రయాత్ర

**విజేతలకు సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు**

**9 అవార్డులతో జాతీయ స్థాయిలో తెలుగు సినిమా విశ్వరూపం**

**ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'**

**చిత్రబృందంతో కలిసి నిహారిక సంబరాలు**




అమరావతి, జూలై 19: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో తెలుగు చిత్ర పరిశ్రమ ఏకంగా 9 అవార్డులను కైవసం చేసుకుని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. టాలీవుడ్ సాధించిన ఈ అసాధారణ విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు.. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల ప్రతిభ మనకు గొప్ప గర్వకారణమని కొనియాడారు. కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి




బలమైన మూలస్తంభాలని, తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తరతరాలకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన తన పోస్ట్‌లో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లను ట్యాగ్ చేయడంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను జతచేశారు.

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తన అధికారిక పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ.. భారతీయ చలనచిత్ర రంగంలో తెలుగు సినిమా మరోసారి తన జైత్రయాత్రను చాటిచెప్పడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా నిహారిక కొణిదెల సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై యువ ప్రతిభతో తెరకెక్కిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పల్లెటూరి నేపథ్యంలో స్నేహం, కుటుంబ బంధాలు, సామాజిక విలువలు, భావోద్వేగాలను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించి ఈ అవార్డును దక్కించుకుందని ప్రశంసించారు. తెలుగు సినిమా కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా కథ, కథనం, నటనతో పాటు 24 క్రాఫ్టుల్లోనూ తన తిరుగులేని సాంకేతిక నైపుణ్యాన్ని చాటుకుందని, వెండితెరపై తెలుగు వారి సృజనాత్మకతకు, కష్టానికి దక్కిన గౌరవమే ఈ జాతీయ పురస్కారాలని మంత్రి స్పష్టం చేశారు.

మరోవైపు 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో తమ చిత్రానికి రెండు జాతీయ అవార్డులు వరించడంతో 'కమిటీ కుర్రోళ్ళు' టీమ్ సంబరాల్లో మునిగిపోయింది. ఉత్తమ తెలుగు చిత్రంతో పాటు, ఈ సినిమాకు గాను ఉత్తమ మేకప్ విభాగంలో పి.రవికుమార్ కూడా జాతీయ అవార్డును దక్కించుకున్నారు. ఈ డబుల్ ధమాకాతో చిత్రబృందంతో కలిసి నిర్మాత నిహారిక కొణిదెల సంతోషంతో స్టెప్పులేసి తన ఆనందాన్ని పంచుకున్నారు. టాలీవుడ్ కీర్తి పతాకాన్ని ఎగురవేసి, తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా చేసిన నటులు, దర్శకులు, నిర్మాతలు మరియు సాంకేతిక నిపుణులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ.. రాబోయే రోజుల్లో తెలుగు సినిమా మరిన్ని అంతర్జాతీయ శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## 'రామాయణం'లో భాగం కావడం గర్వంగా ఉంది: రకుల్

**ముంబయి, జులై 19 (రుద్రన్యూస్) :**

ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో భాగం కావడం తన జీవితంలో మరచిపోలేని అనుభూతి అని ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప ప్రయాణమని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'రామాయణం' ప్రచార కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న రకుల్.. ఈ సందర్భంగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఇంత భారీ స్థాయి చిత్రంలో నటించే అవకాశం దక్కడం గర్వకారణమని, ప్రపంచ వేదికపై భారతీయ ఇతిహాసాన్ని ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించే ప్రయత్నంలో భాగస్వామి కావడం ఎంతో ప్రత్యేకమని తెలిపారు. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ చిత్రంలో రకుల్ శూర్పణఖ పాత్రను పోషిస్తున్నారు. కథలో కీలకమైన ఈ పాత్రలో ఆమె ఎలా కనిపించనున్నారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. భారీ వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూపొందిస్తున్న 'రామాయణం'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగం 2026 దీపావళి సందర్భంగా, రెండో భాగం 2027 దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.

## మనసు చెప్పిందే చేస్తా: కాజల్



ముంబయి, జులై 19 (రుద్రన్యూస్) :చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా విజయవంతంగా కొనసాగుతున్న ప్రముఖ నటి కాజల్ అగర్వాల్.. మాతృత్వం తర్వాత తన జీవితంలో, ఆలోచనా విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. అవకాశాల కోసం ప్రతి విషయానికీ అంగీకరించే రోజులు ముగిశాయని, ఇప్పుడు మనసుకు నచ్చిన కథలకే ప్రాధాన్యం ఇస్తున్నానని వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కాజల్.. నలభై ఏళ్ల వయసులో నాలుగేళ్ల కుమారుడు నీల్‌కు తల్లిగా బాధ్యతలు నిర్వర్తించడం తనలో కొత్త ఆలోచనలను తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం ఏ కథ విన్నా ఒక తల్లిగా ఆలోచిస్తున్నానని, భవిష్యత్తులో తన కుమారుడు 'ఇది మా అమ్మ సినిమా' అని గర్వంగా చెప్పుకునేలా ఉండే పాత్రలనే ఎంచుకోవాలనుకుంటున్నానని చెప్పారు. కెరీర్ ప్రారంభంలో శరీరాకృతి, పాత్రల ఎంపిక విషయంలో ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ, ఇప్పుడు అలాంటి పరిస్థితులకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను నటిస్తున్న హిందీ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ'లో న్యాయవాది అర్చన పాత్రను పోషిస్తున్నట్లు కాజల్ తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా, వారానికి రెండుసార్లు చేసే బరువు వ్యాయామాలు, శాకాహార జీవనశైలి ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యమే జీవితంలో అత్యంత ముఖ్యమని, మిగతా విజయాలన్నీ ఆ తర్వాతేనని చెప్పారు. సామాజిక మాధ్యమాల వినియోగంపై కూడా కాజల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## మొదటి ప్రేమ ప్రతిపాదనను గుర్తుచేసుకున్న అనుష్క



టాలీవుడ్ ప్రముఖ నటి అనుష్క శెట్టి తన పాఠశాల రోజులలో ఎదురైన తొలి ప్రేమ ప్రతిపాదన గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. చిన్నతనంలో జరిగిన ఆ సంఘటన ఇప్పటికీ తనకు మధుర జ్ఞాపకంగానే ఉందని తెలిపారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అనుష్క.. తాను పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఒక సహ విద్యార్థి ఎంతో ధైర్యంగా వచ్చి తనపై ప్రేమను వ్యక్తం చేశాడని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ వయసులో ప్రేమ అంటే ఏమిటో కూడా పూర్తిగా అర్థం కాలేదని, అతను చెప్పిన వెంటనే అమాయకంగా 'సరే' అని సమాధానం చెప్పానని నవ్వుతూ వెల్లడించారు. ఆ సంఘటనను అప్పట్లో చాలా సాధారణంగా తీసుకున్నానని, కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది జీవితంలో మరచిపోలేని మధుర జ్ఞాపకంగా మిగిలిపోయిందని అనుష్క చెప్పారు. చిన్ననాటి అమాయకత్వం వల్ల జరిగిన ఆ సంఘటనను ఇప్పటికీ చిరునవ్వుతో గుర్తు చేసుకుంటానని తెలిపారు. యోగ శిక్షకురాలిగా తన వృత్తిని ప్రారంభించిన అనుష్క, నాగార్జున హీరోగా నటించిన 'సూపర్' చిత్రంతో సినీ రంగంలో అడుగుపెట్టారు. అనంతరం 'అరుంధతి', 'బాహుబలి', 'భాగమతి' వంటి విజయవంతమైన చిత్రాలతో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం కూడా విభిన్న కథలతో కూడిన చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467